ఈనాడు తిరుపతి
శనివారం అక్టోబరు 26, 2024
7

ర్యాగింగ్ రహిత వాతావరణం సృష్టిద్దాం: ఎస్పీ


విద్యార్థులతో ర్యాగింగ్ నిరోధక ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ, వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

తిరుపతి(బైరాగిపట్టెడ, నేరవిభాగం), న్యూస్‌టుడే: విద్యాలయాల్లో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని సృష్టించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ర్యాగింగ్ నిరోధంపై ఎస్వీయూలోని ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా ర్యాగింగ్ చోటుచేసుకుంటే వెంటనే డయల్ 112, టోల్ ఫ్రీ నంబరు 1800-180-5522 యూజీసీ పోర్టల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ.. అపార భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ర్యాగింగ్‌ను విడనాడి ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, డీఎస్పీ వెంకట నారాయణ, సీడీసీ డీన్ చిన్నరాయుడు, డీఎస్డీబ్యూ సీపీ డైరెక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కేసులతో సరిపోదు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: కేసులు నమోదు చేయడం, నిందితులను అరెస్టు చేయడంతో సరిపోదు.. పక్కాగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయడమే మన బాధ్యత అని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరి సమావేశ మందిరంలో తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తుపై సూచనలు చేశారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, నాగభూషణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట


స్వర్ణముఖినదిలోకి వాహనాలు వెళ్లకుండా పొక్లెయిన్‌తో కందకం తవ్విస్తున్న అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలం కొత్తవీరాపురం సమీపంలో స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్టవేశారు. కొందరు నదిలో హిటాచీలతో విచ్చలవిడిగా ఇసుక తవ్వుతున్నారని 'ఈనాడు'లో 'అధినేత ఆదేశించినా.. ఆగని అక్రమ రవాణా' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ భార్గవి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. నదిలోకి వాహనాలు వెళ్లకుండా పొక్లెయిన్‌తో కందకాలు తవ్వించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా శుక్రవారం తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. గురువారం శ్రీవారిని 61,004 మంది దర్శించుకున్నారు. రూ.3.48 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

తిరుచ్చిపై శ్రీపద్మావతీ అమ్మవారు



తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీఎస్సీ శిక్షణ దరఖాస్తుకు గడువు పొడిగింపు

తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల దరఖాస్తు గడువును ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిక అధికారి చెన్నయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 5050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


నూతన క్యూలైన్‌ను పరిశీలిస్తున్న ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి అధికారులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను తితిదే ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. శుక్రవారం తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వకుళమాత కేంద్రీయ వంటశాలను పరిశీలించిన ఈవో అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పీఏసీ-5ను తనిఖీ చేశారు. కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంసీ, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద హోటళ్లను పరిశీలించారు. శిలాతోరణం వద్ద తనిఖీలు చేపట్టారు. ఔటర్ రింగ్‌రోడ్డులో నిర్మిస్తున్న నూతన క్యూలైన్‌లు, మరుగుదొడ్లు, ఫుడ్ కోర్టులను పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, సుబ్రమణ్యం, డీఈ చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

వసతి లేని గృహాలు!

- ❖ దుస్థితిలో భవనాలు
- ❖ చాలీచాలని మరుగుదొడ్లు
- ❖ సమస్యలతో అల్లాడుతున్న విద్యార్థులు

ఈనాడు-తిరుపతి; న్యూస్‌టుడే సూళ్లూరుపేట, చంద్రగిరి, సత్యవేడు, గూడూరు పట్టణం: నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీల సంక్షేమానికి కృషి చేశానంటూ నిత్యం వల్లెవేసిన నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అదే సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు చదువుకునే వసతిగృహాలను గాలికి వదిలేశారు. కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాడే మరుగుదొడ్లను బాగు చేయించకపోవడంతో దుర్గంధం నడుమే విద్యార్థులు కాలం గడపాల్సి వస్తోంది. కొన్ని వసతిగృహాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో చెప్పలేని పరిస్థితి. కిటికీలకు అమర్చిన మెష్‌లు చిరిగి దోమలు ఉద్ధృతికి విద్యార్థులు అల్లాడుతున్నారు. వసతి గృహాల్లోని మౌలిక వసతులపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి నిధులు విడుదల చేస్తే విద్యార్థుల సమస్యలు పరిష్కారమవుతాయి.




చెన్నారెడ్డికాలనీలో కిటికీలకు మెష్‌లు సరిగా లేని వసతి గృహంలో నిద్రిస్తున్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల చొరవతో..

గూడూరు బీసీ బాలుర వసతిగృహంలో గతంలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఏడాది కిందట పూర్వ విద్యార్థుల కృషితో రూ.15లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు, పెచ్చులూడుతున్న శ్లాబ్‌లకు మరమ్మతులు చేయించారు. ఆరుబయట వసతిగృహం చుట్టూ గచ్చు నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, దుస్తులు ఉతికేందుకు వీలుగా ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతిగృహంలో ఉంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మొత్తం 77మంది విద్యార్థులు ఉన్నారు.



అధ్వానంగా మరుగుదొడ్లు



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని సమీకృత బాలుర వసతిగృహంలో సుమారు 300 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడి మరుగుదొడ్లు చూస్తే కడుపులో తిప్పి వాంతులు వచ్చే పరిస్థితి. దీంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. వెంటిలేటర్ అద్దాలు పగడంలో చలికి వణుకుతున్నారు. కిటికీ మెష్‌లు చిరిగిపోవడంతో దోమల బెడదతో అల్లాడుతున్నారు.

కూలడానికి సిద్ధంగా..



నారాయణవనం మండలంలోని పాలమంగళం ఎస్సీ బాలుర సంక్షేమవసతిగృహం, సత్యవేడులోని ఎస్సీ బాలుర (కళాశాల) వసతిగృహం, బీఎన్‌కండ్రిగ ఎస్సీబాలుర వసతిగృహాలు పూర్తిగా శిథిలమయ్యాయి. భవనాల పైకప్పులు పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలకు ఉరుస్తుండటంతో పిల్లలు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. తలుపులు, కిటికీలు విరిగిపోవడం, మరమ్మతులకు గురికావడంతో వర్షాలకు గదుల్లో చిరుజల్లులు పడి పిల్లలు చలికి వణికిపోతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని. ఫ్యాన్లు సక్రమంగా పని చేయడం లేదు. సత్యవేడు బీసీ బాలుర వసతిగృహాన్ని 35ఏళ్లుగా అద్దె పెంకుటింటిలో నిర్వహిస్తున్నారు. వర్షాలకు గోడలు, నేల తేమ ఎక్కి పిల్లలు వణుకుతూ చదువుకోవాల్సి వస్తోంది.



శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ..



సూళ్లూరుపేట బీసీ బాలికల వసతిగృహంలో 120 మంది విద్యార్థినులు శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. భవన పైపెచ్చులు ఊడుతుండటంతో భయాందోళన చెందుతున్నారు. ఇక్కడున్న రేకుల షెడ్డు ఉరుస్తోంది. ఆవరణ మట్టి, గులకరాళ్లతో ఉండటం వల్ల ఉదయం, సాయంత్రం విద్యార్థినులు కూర్చుని చదువుకునే సమయంలో ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం నుంచి దుప్పట్లు, ఇతర సామగ్రి అందలేదు.

ఉరుస్తున్నా అంతే..



చంద్రగిరి సాంఘికసంక్షేమ (ఎస్సీ) వసతిగృహం శిథిలావస్థకు చేరి ఉరుస్తోంది. 1978లో నూకలగుంట గట్టుపై నిర్మించిన ఈ భవనం పైకప్పు నెర్రెలు ఏర్పడి చీలిపోతోంది. వాన కురిస్తే విద్యార్థులు జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ వసతిగృహానికి మరమ్మతులు చేయకుంటే ఎప్పుడైనా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది.

రైల్వే ప్రాజెక్టు పనుల్లో కదలిక

- సీఎం సమీక్షతో అడుగులు
- అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు


నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు భూసేకరణ సభలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రైల్వే ప్రాజెక్టుల పనులు పట్టాలెక్కనున్నాయి. వైకాపా హయాంలో మరుగున పడ్డ దస్త్రాలను కూటమి ప్రభుత్వం దారికి తీసుకొస్తోంది. ఇందుకు సీఎం చంద్రబాబు ముగ్గురు అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తాజా సమీక్షలో వెల్లడించారు. దీంతో రైల్వే పెండింగ్ భూసేకరణ తదితర పనుల్లో కదలిక రానుంది.

భూసేకరణ అవసరం

రేణిగుంట-గూడూరులో 36.58 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో మూడో లైన్ మార్గం 83.16 కి.మీ. మేర రూ.884 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు ప్రధానమంత్రి గతి శక్తి కార్యక్రమంలో నిధుల కేటాయింపు జరగ్గా నాలుగేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యం ఉంది. ఈ మార్గంలోని గ్రామాల్లో అండర్ పాస్‌లు, ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు కానుంది.

గాడిలో పెట్టే యత్నాలు

తిరుపతి కేంద్రంగా నిత్యం 130 రెగ్యులర్ రైళ్లు నడుస్తున్నాయి. ఇక్కడ స్టేషన్ రీ-డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. అనుసంధానం పెంచడానికి గతంలో తీసుకొచ్చిన అనేక ప్రాజెక్టులు వైకాపా ప్రభుత్వంలో అటకెక్కాయి. వాటిని గాడిలో పెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులతో పాటు రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులున్నాయి. ఇవన్నీ మూడు, నాలుగేళ్లలో పూర్తి చేయడానికి ప్రణాళిక రచిస్తున్నారు.


● **ఏర్పేడు-పూడి బైపాస్ లైన్:** ఏర్పేడు-పూడి స్టేషన్ల మధ్య 25.36 కి.మీ మేర బైపాస్ లైన్ నిర్మించాలని ప్రతిపాదన ఉంది. దీన్ని ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించి నిర్వహణ, యాజమాన్యం, పర్యవేక్షణ కోసం శ్రీకాళహస్తి ఆర్డీవోను అధీకృత అధికారిగా నియమించి భూసేకరణ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. లెవల్ క్రాసింగ్ వద్ద వంతెన.. రేణిగుంట స్టేషన్ సమీపంలో 72 ఎల్‌సీ నంబర్ వద్ద లెవల్ క్రాసింగ్ వద్ద వంతెన నిర్మించాల్సి ఉంది. ఇందుకు అవసరమైన ప్రకటన జారీ చేసింది.

● **మరిన్ని నిధులు అవసరం:** రైల్వే స్టేషన్ల ఆధునికీకరణలో చిత్తూరు, గూడూరు, రేణిగుంట, కుప్పం, పాకాల, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట స్టేషన్లను దశల వారీగా అభివృద్ధి చేయనున్నారు. వీటి ఎంపిక పూర్తి కాగా పనులు పట్టాలెక్కనున్నాయి. ఇందులో కుప్పం డిజైన్‌లో మార్పులు చేపట్టి మరిన్ని నిధులు తీసుకురావాల్సి ఉంది.

రూ.20 కోట్ల కేటాయింపు

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో భూసేకరణకు రూ.20 కోట్లు కేటాయించారు. డక్కిలి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే భూసేకరణ చేపట్టగా వారికి ఇంకా పరిహారం అందలేదు. తాజా పరిస్థితుల్లో నగదు చెల్లింపులు చేపట్టే వీలుంది. కొత్త మార్గాల్లో గూడూరు-దుగరాజపట్నం, తడ-శ్రీకాళహస్తి వరకు విస్తరణ ప్రణాళికలు ఉన్నాయి. వీటిని దశల వారీగా చేపట్టాల్సి ఉంది.


తనపల్లి.. పచ్చదనం శోబిల్లి



తిరుపతి గ్రామీణ మండలం తనపల్లి పరిసరాలు ఆహ్లాదం పంచుతున్నాయి. పద్మగిరి కొండపై నుంచి పచ్చని పంట పొలాలు.. ఎత్తయిన చెట్లు.. ఇళ్లతో హరితశోభితమైన పరిసరాలు కనుచూపు మేర కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఆవిష్కృతమైన ఈ సుందర దృశ్యం కనువిందు చేస్తుండగా భక్తులు, సందర్శకులు చరవాణుల్లో చిత్రీకరిస్తున్నారు.

- ఈనాడు, తిరుపతి

పాడిపశువులు దైనందిన జీవితంలో భాగం


గోపూజ చేస్తున్న పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంఎం నాయక్, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: పాడి పశువులు, పెంపుడు జంతువులు మన దైనందిన జీవితంలో ఒక భాగమని పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంఎం నాయక్ పేర్కొన్నారు. తిరుపతి గ్రామీణ మండలం చిగురువాడ పంచాయతీలోని పాపిరెడ్డిపురంలో శుక్రవారం 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో పాల్గొన్నారు. 16 రకాల జంతువులను గణన చేయనున్నామని ఆయన చెప్పారు. ఈ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 5500 మంది ఎన్యూమరేటర్లు, 1200 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారని తెలిపారు. అంతకుముందు గోపూజ చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్వీ పశువైద్యకళాశాల రిజిస్ట్రార్ రవికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అధికారులకు షాక్

సేవలందించని వారిపై అపరాధ రుసుము

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారులకు ఏపీఈఆర్‌సీ షాక్ ఇచ్చింది.. విద్యుత్తు శాఖ పౌరపట్టిక ప్రకారం వినియోగదారులకు సేవలందించడంలో జాప్యం ప్రదర్శించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(ఏఈ), క్షేత్రస్థాయి అధికారులపై అపరాధ రుసుము విధించింది.. ఈ మొత్తాలను సంబంధిత ఇంజినీర్లు, అధికారుల వేతనాల నుంచి కోత విధించాలని ప్రతిపాదిస్తూ ఉత్తర్వులిచ్చింది.. సదరు నగదును వినియోగదారులకు చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొంది.. ఇందులో భాగంగా ఈ ఏడాది జులై 1 నుంచి సెప్టెంబరు చివరి వరకు మూడు నెలల కాలంలో సేవలందించని అధికారులపై రూ.20.62 లక్షల అపరాధ రుసుము విధించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్తు శాఖ పరిధిలో ఎనిమిది డివిజన్లు ఉండగా.. వీటి పరిధిలో అన్ని రకాలకు సంబంధించి సుమారు 19.55 లక్షల సర్వీసులు ఉన్నాయి. సర్కిల్ 99 సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. నూతన సర్వీసుల జారీలో జాప్యం, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ ద్వారా ప్రస్తావనకు వచ్చిన సమస్యలు, పనుల అంచనా విలువల తయారీలో జాప్యం, స్తంభాలు, లైన్లు, మీటర్ల మార్పు, అధిక బిల్లింగ్ సమస్యలను పౌరపట్టిక ప్రకారం పరిష్కరించకపోవడంతో 2,521 సర్వీసులకు సంబంధించి రూ.20,62,300 అపరాధ రుసుము విధించారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలిలా..

డివిజన్	సర్వీసులు	అపరాధ రుసుము(రూ.ల్లో)
చిత్తూరు రూరల్	65	93,350
చిత్తూరు సిటీ	186	5,70,150
మదనపల్లె	119	69,650
పీలేరు	77	37,350
పుంగనూరు	186	3,28,350
పుత్తూరు	215	4,77,750
తిరుపతి రూరల్	141	1,03,550
తిరుపతి అర్బన్	1532	3,82,150

సంఖ్య తగ్గడం లేదు..

మూడేళ్ల నుంచి సకాలంలో సేవలందించని వారికి అపరాధ రుసుము విధిస్తోంది. అయినా ఆశించిన స్థాయిలో మార్పు రాలేదు. కొందరు అపరాధ రుసుము నుంచి తప్పించుకునేందుకు సీనియారిటీ జాబితాలో దరఖాస్తులు తొలగిస్తున్నారు. గడువు దాటిన వాటిని పక్కన పెట్టేస్తున్నారు. సేవా లోపం సమస్యలు పెరగడమే గానీ తగ్గడం లేదు.

కాలం చెల్లిన చిక్కీల స్వాధీనం

పాకాల, న్యూస్‌టుడే: పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మద్దిలేటి శుక్రవారం తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన చిక్కీలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారని తెలియడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ బుధవారం తనిఖీ చేసి ప్రధానోపాధ్యాయునికి షోకాజ్ నోటీసులిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పాఠశాల కమిటీ ప్రతినిధులు తనిఖీ అధికారితో మాట్లాడారు. నాణ్యత పరిశీలనకు చిక్కీలను ప్రయోగశాలకు పంపనున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రసూతి మరణాలు నియంత్రించాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసూతి మరణాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఈ ఏడాది సెప్టెంబర్ 24 వరకు జరిగిన ప్రసూతి మరణాలపై వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.



▸ ఆలయం ఎదుట నందమూరి రామకృష్ణ ▸ ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్ ▸ సంగీత దర్శకుడు తమన్, గాయకులు కార్తీక్, సాకేత్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని శుక్రవారం తెల్లవారుజామున అభిషేక సేవలో నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. ఉదయం బ్రేక్‌లో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, జి.శిరీష, మురళీమోహన్, సంగీత దర్శకుడు తమన్, గాయకులు కార్తీక్, సాకేత్, నటుడు అమర్‌దీప్, పార్లమెంట్ కమిటీ ఆఫ్ అఫీషియల్ లాంగ్వేజ్ డిప్యూటీ ఛైర్మన్ భర్తృహరి మహతాబ్, కన్వీనర్ శ్రీరంగ్ అప్పా బర్నే బృందం, తిరుపతి మేయర్ శిరీష దంపతులు, ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ఆలయం వెలుపల నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబునాయుడు ఎన్నిక కావాలని శ్రీవారికి మొక్కుకున్నానని, ఆ మొక్కులు తీర్చుకునేందుకు కాలినడకన తిరుమల వచ్చి శ్రీవారి దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

వన్యప్రాణికి రక్షణేదీ?

జనవాసాల్లో పెరిగిన సంచారం



చుక్కల దుప్పిని చుట్టుముట్టిన కుక్కలు (పాతచిత్రం)

చంద్రగిరి, న్యూస్‌టుడే: వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. అటవీప్రాంతాలకు దగ్గరగా ఉన్న పల్లెల్లో వాటిని మట్టుబెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. నాటు తుపాకీలు, విద్యుత్తు ఉచ్చులకు పెద్దఎత్తున ప్రాణాలు వదులుతున్నా కొన్ని ఘటనలు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. తిరుపతి నగరంతోపాటు ఇతర జనావాసాల్లోకి చొరబడుతూ మృత్యువాత పడుతున్న వాటిసంఖ్య క్రమేణా పెరుగుతోంది.

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని చాలావరకు గ్రామాలు శేషాచలం కొండలకు చేరువలో ఉన్నాయి. ప్రధానంగా చంద్రగిరి మండలంలోని పనపాకం, అరిగిలవారిపల్లి, ముంగిళిపట్టు, ఎం.కొత్తపల్లి, ఎం.కొంగరవారిపల్లి, మూలపల్లి, ఎగువకాశిపెంట్ల, గంగుడుపల్లితో పాటు యర్రావారిపాలెం మండలం అటవీ ప్రాంతం పరిధిలో ఉంటుంది. పనపాకం పరిధిలో నాటు తుపాకుల వినియోగం, రేసుకుక్కలతో వేట సాగించిన ఘటనలో గతంలో వెలుగు చూశాయి.

విక్రయానికి మాంసం

పంట పొలాల్లోకి ఆకలి.. దప్పులు తీర్చుకోవడానికి వన్యప్రాణులు, క్రూర మృగాలు వస్తుండగా అదునుచూసి వేట కుక్కలు, ఊర కుక్కలను వాటి పైకి ఉసిగొల్పుతున్నారు. గాయపడ్డ జింకలు, దుప్పులు తదితర వాటిని చంపివేసి కిలో మాంసం రూ.400 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నారు. ఈక్రమంలో కొందరు వేటగాళ్లపై అధికారులు కేసులు నమోదుచేసి న్యాయస్థానానికి అప్పగించిన ఘటనలు ఉన్నాయి.

ఏనుగులతో పంటనష్టం



యర్రావారిపాలెం వీఆర్ అగ్రహారంలో చుక్కల దుప్పిని పట్టుకెళ్తున్న వైకాపా అనుచరులు (పాత చిత్రం)

తరచూ ఏనుగుల సంచారంతోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఆర్నెల్ల కిందట ఓ గున్న ఏనుగు మృతిచెందగా కళేబరం కుళ్లిపోయిన దశలో గుర్తించారు. పాకాల మండలంలో పలువురు రైతులు ఏనుగుల దాడిలో మృతిచెందిన ఘటనలు ఇటీవల నమోదయ్యాయి.

నగరంలోనూ సంచారం

తిరుపతి నగరంలో జంతువుల సంచారం తరచూ కనిపిస్తోంది. ఎస్వీయూ పరిసరాలతోపాటు మంగళం, జీవకోనలో జింకలు, దుప్పులు, చిరుతపులుల సంచారం ఇటీవల కాలంలో పెరిగింది. పలు జింకలు ఇటీవల ప్రమాదం బారిన పడిన ఘటనలు ఉన్న నేపథ్యంలో నగరం చుట్టూ రక్షణ కంచెలు, కందకాల తవ్వకం వంటివి చేపట్టాలన్న డిమాండు పెరిగింది. ప్రధానంగా చిరుతల సంచారంపై మంగళం పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంరక్షణకు చర్యలు

వన్యప్రాణుల సంరక్షణతోపాటు శేషాచల అడవుల్లో ఎర్రచందనం, శ్రీగంధం అక్రమంగా తరలిస్తే ఉపేక్షించే ప్రసక్తి లేదు. వేటగాళ్లు, స్మగ్లర్లపై కేసులు నమోదుచేసి న్యాయస్థానానికి అప్పగిస్తాం. అరుదైన వన్యప్రాణులు, అటవీసంపద కాపాడేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతాం. కంచె నిర్మాణం అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది.

\- వివేక్, డీఎఫ్‌వో

సీఎం సహాయ నిధికి ఎడిపై విద్యార్థుల విరాళం



ఎమ్మెల్యే పులివర్తి నానికి చెక్కు అందజేస్తున్న విద్యార్థులు

తిరుచానూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి తిరుచానూరు ఎడిపై విద్యార్థులు రూ.5 లక్షలు విరాళం అందించడం అభినందనీయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ని కలిసి చెక్కు అందజేశారు.

మాల్వాడి గుండం.. ప్లాస్టిక్ గండం



తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నగరాన్ని ప్లాస్టిక్ రహిత ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియను అధికారులు పూర్తిగా విస్మరించారు. ఆధ్యాత్మిక నగరంలో 2017లో ఉవ్వెత్తున ఎగసిన ప్లాస్టిక్ ఉద్యమం గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నీరుగారింది. అధికారుల నిర్లక్ష్యం ఫలితం తిరుపతిలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ నిల్వలు నగరంలోని మురుగు, వర్షపునీటి కాలువల్లో, యూడీఎస్ మ్యాన్‌హోళ్లలో చేరి డ్రైనేజీ వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి పారే మాల్వాడి గుండం కాలువలో సైతం ఇంత పరిమాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడం ఆందోళన కలిగిస్తోంది.

ఆక్రమణల తొలగింపు జీవో శుభపరిణామం



శారదా పీఠం భవనం వద్ద జీవో కాపీలు చూపుతున్న కిరణ్‌రాయల్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆశీస్సులతో తిరుమలలోని శారదాపీఠం ఆక్రమణలను తొలగించాలని ప్రభుత్వం జీవో జారీ చేయడం శుభపరిణామమని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. శుక్రవారం స్థానిక విశాఖ శ్రీశారదాపీఠం భవనం వద్ద ఆయన శ్రీవారి చిత్రపటానికి పూజలు చేసి జీవో ప్రతులను ప్రదర్శించారు. ఈ ఆక్రమణలు తొలగించాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కూటమి ప్రభుత్వం జీవో జారీచేయడం సంతోషదాయకమన్నారు. కార్యకర్తలు హరి, మనోజ్, కిషోర్, సిద్ధూ, సుమన్, ముని తదితరులు పాల్గొన్నారు.

14న సైన్స్ సెంటర్‌లో పోటీలు

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో బాలల మూడో సైన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ శుక్రవారం తెలిపారు. నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు నంబర్లు 08772286202, 7989694681ను సంప్రదించాలని సూచించారు.

28 నుంచి ఎస్ఎఫ్ఐ నిరసన

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి రవి తెలిపారు. శుక్రవారం నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు వినోద్, అశోక్, తేజ, నరేంద్ర, గురవయ్య, శ్రీనివాస్, రవీంద్ర, గణేష్, డేవిడ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మొక్కుబడిగా అదాలత్

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో జరిగిన ఉద్యోగుల పింఛను సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన అదాలత్ కార్యక్రమం మొక్కుబడిగా జరిగిందని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.గోపాల్ విమర్శించారు. శుక్రవారం జరిగిన అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అదాలత్ నిర్వహించడం దారుణమన్నారు. ఏజీ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు అరగంటలోనే సమావేశం ముగించారని ఆయన ఆరోపించారు.

జలవనరుల అభివృద్ధికి రూ.2.05 కోట్లు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం (రాష్ట్ర డిజాస్టర్ మిడికేషన్ ఫండ్) కింద ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని జలవనరుల అభివృద్ధిలో భాగంగా నాలుగు పనులకు రూ.2.05 కోట్లు కేటాయించారు. కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రూ.30.88 లక్షలు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రూ.92 లక్షలు, తిరుపతి జిల్లా పరిధి కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ అభివృద్ధి పనులకు రూ.43 లక్షలు, అన్నమయ్య జిల్లా పరిధి నిమ్మనపల్లె మండలంలోని బహుదా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులకు రూ.40 లక్షలు కేటాయించారు. ఈ నాలుగు పనుల నిర్వహణకు పరిపాలనా పరమైన అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. వీలైనంత త్వరగా పనుల నిర్వహణకు టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	110
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	187

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్మోహన్

ఐరాల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రతో వైకాపా దోపిడీ చేసి రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆరోపించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 43వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట వేస్తోందని, ఇందుకు ప్రత్యేక విధానం తీసుకురానుందని, ఓ కమిటీ సైతం ఏర్పాటు చేసిందన్నారు. కాణిపాకంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖోఖో క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల ప్రవీణ్, కార్యదర్శి శరత్, తెదేపా మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు హరిబాబునాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, జిల్లా క్రీడాధికారి బాలాజీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే.. మొదటి రోజున జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు అనంతపురం జట్టుపై 8-3 తేడాతో గెలిచింది. పశ్చిమ గోదావరి జట్టు కడపపై 8-7, విశాఖపట్నం జట్టు గుంటూరుపై 14-8, శ్రీకాకుళం.. విజయనగరం పై 9-3, బాలుర విభాగంలో నెల్లూరు, కడప జట్ల మధ్య జరిగిన పోటీల్లో 11-11 పాయింట్లతో డ్రాగా ముగిసింది.

తితిదే బ్యాంకు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయండి

తిరుపతి(బైరాగిపట్టెడ): ఈ నెల 28వ తేదీన జరిగే తితిదే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జేఈవో గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తితిదే పరిపాలన భవనంలో ఆమె సమీక్షించారు. తిరుమలలోని ఎస్వీ హైస్కూల్, తిరుపతిలోని ఎస్‌జీఎస్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జేఈవో తెలిపారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి లక్ష్మి, ఎన్నికల అధికారి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పెంపు.. ఆనందం ఇంపు

'మండలి'పై ఆశావహుల ఆశలు



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ అనుబంధంగా ఉన్న ప్రధాన ఆలయాల్లో ధర్మకర్తల మండలి సభ్యుల సంఖ్యను పెంపుదల చేస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.20 కోట్లు వార్షిక ఆదాయం కలిగిన అన్ని ఆలయాలకు నియమించే ట్రస్టుబోర్డు సభ్యుల సంఖ్య గతంలో 15 ఉండగా దాన్ని 17కు పెంచింది. దీంతో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా అవకాశం దక్కించుకునేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు.

ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలిలో గతంలో ఛైర్మన్‌తో పాటు 14 మంది సభ్యులు, గురుకుల్ కుటుంబం నుంచి ఎక్స్‌అఫిషియో సభ్యునిగా ఒకరికి అవకాశం కల్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బ్రాహ్మణులతో పాటు నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో 15గా ఉన్న సంఖ్యను 17కు పెంచుతున్నట్లు క్యాబినెట్ తీర్మానించింది. పెరిగిన సంఖ్యకు తగ్గట్టుగా ఆయా సామాజిక వర్గాల్లో ఆశావహులు యత్నాలు ప్రారంభించారు. బీసీ విభాగంలో గతంలో నాయీబ్రాహ్మణులు పోటీ పడేవారు. ఈ సామాజిక వర్గానికి ప్రత్యేక కోటా ఉండటంతో ఆ స్థానంలో అవకాశానికి బీసీలకు సంబంధించి మిగిలిన కులాల నేతలు యత్నిస్తున్నారు.

'ప్రత్యేకం'పై.. సందిగ్ధం..

గత ప్రభుత్వం ట్రస్టుబోర్డు సభ్యులతో పాటు ప్రత్యేక ఆహ్వానితుల పేరుతో మళ్లీ పలువురు నేతలకు పట్టం కట్టింది. ఈ ప్రభుత్వం అదే దిశగా ప్రత్యేక ఆహ్వానితులను కొనసాగిస్తుందా..? ఆ విధానానికి స్వస్తి పలుకుతుందా అన్న విషయమై ఇంకా స్పష్టత రాలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డులో అవకాశం లేకున్నా.. ప్రత్యేక ఆహ్వానితులు జాబితాలోనైనా అవకాశం కల్పించాలని పలువురు.. ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకోవడంలో తలమునకలయ్యారు.

వెయిట్ లిఫ్టింగ్ జిల్లా జట్టు ఎంపిక

వడమాలపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో వడమాలపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బాలబాలికలకు వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు.

బాలికల జట్టు: అశ్విని, మానస, పల్లవి(శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల, తిరుపతి), రమ్య, సరస్వతి(బాలికల పాఠశాల, రేణిగుంట), మానస, అన్నపూర్ణ, సుమిత్ర, యశ్వంతి(బాలుర ఉన్నత పాఠశాల, వడమాలపేట)

జిల్లా బాలుర జట్టు: సతీష్(పల్లం), గురు, దిలీప్, శంకర్, శేఖర్, ఉదయ్‌కుమార్, మగ్దుమ్, ఆలీ, సతీష్, శ్రావణ్‌కుమార్, వినయ్‌కుమార్, అనీష్, హర్షవర్ధన్ (బాలుర ఉన్నత పాఠశాల, వడమాలపేట)



మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపల్ నాగపద్మజ, ఏపీఎస్ఐఆర్‌డీ రమేష్, కడప సీఈవో ఓబులమ్మ

పంచాయతీల అభివృద్ధి కీలకం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో పంచాయతీల అభివృద్ధి కీలకమని శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపల్ నాగపద్మజ అన్నారు. పట్టణంలోని ఈటీసీ కేంద్రం ఆవరణలో శుక్రవారం చిత్తూరు, కడప జిల్లాలకు సంబంధించి సీఈవో, డీపీవో, ఎంపీడీవోలకు శిక్షణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, అభివృద్ధి, నిధుల వినియోగం తదితర అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎస్ఐఆర్‌డీ రమేష్, కడప సీఈవో ఓబులమ్మ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, ఈటీసీ వైస్ ప్రిన్సిపల్ విద్యారమ తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్తు కాంగ్రెస్‌దే'



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్‌రెడ్డి

తిరుపతి (గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: భవిష్యత్తు కాంగ్రెస్‌దేనని. . కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి ఈదా సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి హోదాలో తిరుపతికి విచ్చేసిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ యువజన వసతిగృహంలో శుక్రవారం నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమావేశంలో పార్టీ పటిష్ఠత, భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, నగర మాజీ అధ్యక్షుడు గోపిగౌడ్, జిల్లా ఇన్‌ఛార్జులు గోపాల్ రెడ్డి(నెల్లూరు), వెంకట నరసింహులు(అనంతపురం), రాంభూపాల్ రెడ్డి(చిత్తూరు), నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో స్వర్ణోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలు ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనెట్ హాల్లో శుక్రవారం గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం రెండు రోజుల స్వర్ణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వర్సిటీ ఉప కులపతి అప్పారావు మాట్లాడుతూ.. గ్రంథాలయ శాస్త్ర విభాగం విద్యారంగానికి కావలసిన గ్రంథ పాలకులను తయారు చేసి.. వారిని సమాచార వారధులుగా సమాజానికి అందిస్తోందన్నారు. ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం వ్యవస్థాపకులు శ్రీపతి నాయుడు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట రైల్వేస్టేషన్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. గురువారం రాత్రి రేణిగుంట వైపు నుంచి వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఆగి హైదరాబాద్ వైపు వెళ్లిన తరువాత కొందరు పట్టాలపై వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. రైల్వేస్టేషన్ అధికారులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూశారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని రేణిగుంట రైల్వే పోలీసులు తెలిపారు.

భాజపా విస్తరణ దిశగా పనిచేయాలి

తిరుపతి(గాంధీరోడ్డు): ప్రతి మండలంలో కనీసం 25 మంది క్రియాశీలక సభ్యులు అర్హత సాధించే దిశగా కలిసి కృషి చేయాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ పేర్కొన్నారు. పూర్తి సమయం పార్టీ విస్తరణ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో భాజపా సాధారణ సభ్యత్వం 10 కోట్లు మార్కు దాటిన సందర్భంగా తిరుపతిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో భాజపా క్రియాశీలక సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి, అసెంబ్లీ ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్, నాయకులు డాక్టర్ శ్రీహరిరావు, వరప్రసాద్, నవీన్‌కుమార్ రెడ్డి, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

బాంబు బెదిరింపులపై విచారణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: విమానాశ్రయానికి బాంబు బెదిరింపులపై ఏర్పేడు పోలీసులు విచారణ చేపట్టారు. ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు స్టార్ ఎయిర్‌లైన్ విమానానికి బెదిరింపులకు దిగుతూ అంతర్జాలంలో సందేశాలు పంపడంపై బెంగళూరులోని ఆ సంస్థ కార్యాలయం దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాకు చెందిన ఓ వ్యక్తిని గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఆ వివరాలను తెలుసుకునేందుకు శుక్రవారం ఏర్పేడు పోలీసులు బెంగళూరుకు వెళ్లినట్లు తెలిసింది.

ద్విచక్రవాహనం ఢీ వ్యక్తి దుర్మరణం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలకేంద్రం వద్ద నిల్చొని ఉన్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సుబ్బారావు వివరాల ప్రకారం.. 4వ వార్డు సాలెకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు (58) రోడ్డు పక్కన నిల్చొని ఉండగా చింతగుంటకు చెందిన మురళీ ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి ఢీకొనడంతో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు సీహెచ్‌సీకి తరలించే క్రమంలో మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని అపాచీ కార్మికుడి మృతి

తడ, న్యూస్‌టుడే: తడ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి రైలు ఢీకొని వరదయ్యపాళెం మండలానికి చెందిన అపాచీ కార్మికుడు ప్రభాకర్(48) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బంధువుల వివరాల మేరకు.. వరదయ్యపాళెంలో కాపురం ఉంటున్న ప్రభాకర్ అపాచీలో విధులు ముగించుకుని సొంత పని నిమిత్తం సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి రాత్రి రైల్లో తడకు చేరుకున్నాడు. తడ రైల్వేస్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటే క్రమంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందారు. జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

రెడ్డివారిపల్లిలో రెవెన్యూ గ్రామసభ

చంద్రగిరి, న్యూస్‌టుడే: రెడ్డివారిపల్లి పంచాయతీలో సర్పంచి రేవతి అధ్యక్షతన తహసీల్దారు శివరాంసుబ్బయ్య శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలోని రైతులు, నివాసితులు మ్యుటేషన్స్, జాయింట్ ఎల్‌పీఎంలు, భూమి తగాదాలు, సెక్షన్22(ఎ) అభ్యంతరాలపై వినతిపత్రాలు అందించారు.

తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతానికి పిలుపు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో శనివారం నుంచి చేపట్టిన తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు.

గోవిందమాల భక్తుల వకుళమాత సందర్శన

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుమల శనివారాలను పురస్కరించుకుని పేరూరు గ్రామంలో గోవిందమాల ధరించిన భక్తులు వకుళమాత అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం శ్రీకృష్ణభజన మందిరంలో సుదర్శన హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అక్కగార్ల ఆలయం, వకుళమాత అమ్మవారిని దర్శించుకున్నారు.

తిరుమల చేరుకున్న కేంద్ర మంత్రి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం కేంద్ర కార్మిక, ఉపాధి పరిశ్రమల శాఖ మంత్రి శోభా కరంద్లాజే శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. స్థానిక అతిథిగృహం వద్ద కేంద్ర మంత్రికి తితిదే ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

రామచంద్రాపురం, న్యూస్‌టుడే:

సమస్య: కుప్పంబాదూరు నుంచి పరమాల, బంగారెడ్డికండ్రిగ, సీతారామాపురం, తణుకు మీదుగా పుత్తూరుకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు కమ్ముకున్నాయి. **-కృష్ణ, వాహన చోదకుడు**

సమాధానం: సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. **- ఇందిరమ్మ, ఎంపీడీవో**

తాగునీరు, మురుగు సమస్యలకు పరిష్కారం

తిరుపతి(నగరపాలిక): 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన ప్రజా సమస్యల్ని అధికారులు పరిష్కరించారు. ఈనెల 23న టి.నగర్‌లోని తాగునీటి సమస్యను ఇంజినీరింగ్ అధికారులు తీర్చారు. పోస్టల్‌కాలనీలోని నాలుగో క్రాస్‌లోని అలెక్సా హోంస్టే వద్ద పొంగుతున్న మ్యాన్‌హోల్ సమస్యను అధికారులు పరిష్కరించారు. ఈ నెల 24న ప్రచురితమైన రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని వెంకటరమణ గుండె చికిత్సల ఆసుపత్రి పక్క సందులోని చెత్త దిబ్బల్ని తొలగించారు. తిలక్‌రోడ్డులోని పెట్రోల్ బంకును ఆనుకుని ఉన్న కొత్త మాస్టర్‌ప్లాన్ రోడ్డులో వాహనాల మధ్య తాత్కాలికంగా శుభ్రం చేశారు. పూర్తి స్థాయిలో శుభ్రం చేసేందుకు వాహనాలను తరలించాలని సిబ్బంది స్థానికుల్ని కోరారు.

స్పందనకు వందనం

గుంత పూడ్చివేత

రామచంద్రాపురం: 'ఈనాడు'లో ఇటీవల 'మేమున్నా మీకు తోడుగా' శీర్షిక వచ్చిన వార్తకు గ్రామస్థులు స్పందించి మట్టితో గుంత పూడ్చారు. రోడ్డుపై నీరు నిల్వ చేరకుండా చేశారు.

కాలువ పనులు ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన



పాకాల: దామలచెరువులో కోనేటిచెరువుకు పెద్ద వంక నుంచి నీటిని తరలించే కాలువ శిథిలమవడంతో చెరువుకు నీళ్లు చేరని వైనంపై గతనెల 11న 'కోనేటి చెరువు-ఆక్రమణల దరువు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఇటీవల చెరువు స్థలానికి సర్వే చేసి.. మరమ్మతులు చేపట్టేలా నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. పూడికతీతతో పాటు ముళ్లకంపల తొలగించే పనులు ప్రారంభమయ్యాయి.

శెట్టిపల్లె రోడ్డుకు మోక్షం ఎన్నడో!

రెండు నెలలుగా ఆగిన పనులు



నిర్మాణ పనులు నిలిచిన మంగళం-శెట్టిపల్లె మార్గం



మట్టి రోడ్డు నాణ్యత పరిశీలిస్తున్న తితిదే అధికారులు

మంగళం(తిరుపతి), న్యూస్‌టుడే: తితిదే నిర్మిస్తున్న మంగళం-శెట్టిపల్లె మాస్టర్ ప్లాన్ రోడ్డు అర్ధాంతరంగా ఆగిపోయింది. రెండు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. రోడ్డు నిర్మాణానికి తెలుగు గంగ పైపులైన్లు అడ్డు రావడంతో తితిదే అధికారులు పనులకు అడ్డు చెప్పారు. అప్పటి వరకు రోడ్డు వెడల్పులో భాగంగా మట్టి పనులను మాత్రమే చేసిన గుత్తేదారు పనులు ఆపేసి వెళ్లిపోయారు. మళ్లీ ఇప్పటి వరకు తిరిగి పనులు ప్రారంభం కాలేదు. అడ్డంకుల పేరుతో పనులను పూర్తిగా ఆపేసి, స్థానికుల ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. మరోవైపు ఈ రోడ్డుతోపాటే ప్రారంభమైన తిరుచానూరు రోడ్డు మాత్రం పూర్తై, వాహనాల రాకపోకలు సాగుతుండడం గమనార్హం.

తెలుగుగంగ పైపులు దెబ్బతింటాయని..

రూ. 15.12 కోట్ల వ్యయంతో సుమారు 8 కిలోమీటర్ల దూరం, 80 అడుగుల వెడల్పుతో నాలుగు వరుసలుగా రహదారిని అభివృద్ధి చేసేలా రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే తెలుగు గంగ పైపులైను అడ్డురావడంతో పనులు ఆగిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా తెలుగు గంగ నీటి పైపులైన్లు ఉండడంతో పైపులైన్ పైభాగంలో రోడ్డు నిర్మిస్తే పైపులు దెబ్బతింటాయని, రోడ్డు కూడా దెబ్బతింటుందని తితిదే ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులకు అడ్డు చెప్పారు. అంతేకాదు నాలుగు వరుసల రోడ్డును రెండు వరుసలకు కుదించాలని గుత్తేదారుకు సూచించారు. దీంతో టెండరు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయలేనని గుత్తేదారు అధికారులకు చెప్పినట్టు సమాచారం. అయితే ఇటీవల తితిదే ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇప్పటి వరకు జరిగిన మట్టిరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణం పనులు మళ్లీ ప్రారంభమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ రహదారి కథ — రేణిగుంట, తిరుచానూరు రైల్వే స్టేషన్లతో అనుసంధానం చేస్తూ, తిరుపతి నగర శివారు ప్రాంతాలను కలిపేలా మంగళం-శెట్టిపల్లె రోడ్డును తితిదే నిర్మించేందుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. నగర శివారు ప్రాంతాలతోపాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకోవడానికి ఓ మార్గంగా, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేలా రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే నిర్మాణ పనులకు తొలి నుంచీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. రేణిగుంట-తిరుపతి ప్రధాన మార్గాన్ని, అటు కరకంబాడి-తిరుపతి ప్రధాన రహదారిని కలిపేందుకు ఈ మార్గాన్ని నిర్మించేందుకు 2023 నవంబరులో తితిదే పాలకవర్గం తీర్మానం చేసింది. ఇతర ప్రాంతాల నుంచి కరకంబాడి మార్గం ద్వారా వచ్చే యాత్రికులు తిరుచానూరుకు వెళ్లేందుకు అనువుగా, అలానే కొత్తగా నిర్మిస్తున్న తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు సులువుగా చేరుకునేందుకు అనువుగా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకుంది.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



ఆలయం వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారిని శుక్రవారం కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

27న పవిత్రోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 27న అంకురార్పణ చేపట్టనున్నారు.

ఆర్డీవోకు స్వాగత సత్కారం



ఆర్డీవో రామ్మోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏవో ఝాన్సీలక్ష్మి, కార్యాలయ అధికారులు

తిరుపతి (రెవెన్యూ): తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా బాధ్యతలు చేపట్టిన బి.రామ్మోహన్‌కు కార్యాలయ అధికారులు స్వాగత సత్కారం చేశారు. నిన్నటి వరకు ఇన్‌ఛార్జి ఆర్డీవోగా విధులు నిర్వహించిన రామ్మోహన్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కార్యాలయ పరిపాలనాధికారి ఝాన్సీలక్ష్మి, ఉప తహసీల్దార్లు తిరుమలేశ్వరి, శివ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఉమ తదితరులు

మహిళా వర్సిటీ (తిరుపతి): క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వి.ఉమ పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మహిళా అధ్యయన కేంద్రం, టాటా ట్రస్ట్ ఫర్ క్యాన్సర్, స్వీకార్ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ ధృతి సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ పరిపాలనా భవనం నుంచి నిర్వహించిన ర్యాలీని ఇన్‌ఛార్జి వీసీ జెండాఊపి ప్రారంభించారు. స్వీకార్ మెడికల్ డైరెక్టర్ ప్రశాంత్, రేడియేషన్ అంకాలజిస్ట్ అనూష, ఇన్‌ఛార్జి డీన్ కొలకలూరి మధుజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో ప్రతిభా పాటవాల వెలికితీత

తిరుపతి(బైరాగిపట్టెడ) న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన పోటీతత్వంతో విద్యార్థుల్లో దాగిన ప్రతిభా పాటవాలు వెలుగు చూస్తాయని రెడ్ చెర్రీస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ ఎన్.సునీల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ఆర్సీ రోడ్డులోని పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జీవీఎస్ లోకేష్, పి.యువ దీప్తి, బి.పుష్కల్ కార్తీక్ విజేతలుగా నిలిచారు. పాఠశాల డైరెక్టర్ ఎన్.సునీల్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ వి.హరి కృష్ణ బహుమతులు అందించారు.



విజేతలతో పాఠశాల యాజమాన్యం



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రైల్వేస్టేషన్‌లో ఆగిన లిఫ్ట్



మరమ్మతు చేస్తున్న ఎలక్ట్రిక్ సిబ్బంది

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న లిఫ్ట్ శుక్రవారం రాత్రి అర్ధాంతరంగా ఆగిపోయింది. ఆ సమయంలో తిరుపతి-కాకినాడ రైలు ఎక్కాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే ఎలక్ట్రికల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. 20 నిమిషాలకు పైగా ప్రయాణికులు లిఫ్టులో ఉండటంతో గందరగోళం నెలకొంది. లిఫ్ట్‌లో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశామని, ఎలాంటి అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు దుస్తుల వితరణ



పోసా ప్రతినిధులు, దుస్తులు అందుకున్న విద్యార్థులు

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రతిభావంతులైన 30 మంది పేద విద్యార్థులకు పాకాల పూర్వ విద్యార్థుల సంఘం(పోసా) ఆధ్వర్యంలో శుక్రవారం నూతన దుస్తులను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు వై.లింగయ్యనాయుడు, కోశాధికారి జీవీ ప్రసాద్ చేతుల మీదుగా వీటిని అందజేశారు.

శ్రీసిద్ధేశ్వరస్వామి హుండీ లెక్కింపు

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తలకోనలోని శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అధికారులు హుండీల లెక్కింపు నిర్వహించారు. రెండు నెలల్లో భక్తులు స్వామి వారికి రూ.6,86,476 సమర్పించారు. అన్నదానం హుండీ ద్వారా 120 రోజులకు రూ.74,353 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో మమత తెలిపారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రమాదకరం'

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగం గ్యాలరీలో శుక్రవారం 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐటీయూ నగర అధ్యక్షుడు మాధవ్ కృష్ణ మాట్లాడుతూ ఈ ఎన్నికల విధానం దేశంలో ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ప్రమాదకరంగా ఉందన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ

యర్రావారిపాలెం: కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వారి ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ వారు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం-1994లో భాగంగా నిర్వహించిన 'ఆడ శిశువును కాపాడుదాం-సృష్టిని రక్షిద్దాం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.నేహశ్రీ ద్వితీయస్థానం పొందినట్లు ప్రిన్సిపల్ బి.టి.శ్రీదేవి తెలిపారు. నేహశ్రీకి రూ.3వేలతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు.

అన్నదాన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన కేంద్రంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో పని చేసే పలువురు కార్మికులుపాల్గొన్నారు.

పశుసంపద ఎంతో ముఖ్యం



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, పశు వైద్యులు

తిరుపతి(బైరాగిపట్టెడ): పశుగణనను తిరుపతిలోని తన నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. గోడప్రతులు ఆవిష్కరించారు. పశుసంపద వ్యవసాయ రంగానికి అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. పశువైద్యులు శ్రీకాంత్ కుమార్, నాగశిల్పా, మౌనిక, ఎన్యూమరేటర్లు స్వరాజ్, బాలాజీ పాల్గొన్నారు. **చిన్నగొట్టిగల్లు** మండలంలో పశుగణన కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ సహాయక డైరెక్టర్ రమణకుమార్ ప్రారంభించారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధుల ఢోకా లేదన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మండలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పశుగణన గోడప్రతులు ఆవిష్కరించారు.

ముగిసిన ఆధార్ శిబిరాలు



ఆధార్ సేవల కోసం వచ్చిన ప్రజలు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని పలు పంచాయతీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపుల్లో 864 మంది సేవలు పొందారని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పలు పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించామన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

వన మహోత్సవం



మొక్కలు నాటిన అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వనం-మనం మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల, హాస్టల్ ప్రాంగణంలో ప్రిన్సిపల్, ప్రకాష్ బాబు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. అధ్యాపకులు, ప్రియవర్ధన బాబు, గంగాధర్‌రావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా తాటిచెట్టు



వైకాపా ప్రభుత్వంలో చంద్రగిరి కొత్తపేటలో ఉన్న చెరువులో మట్టిని ఇష్టానుసారంగా తరలించిన పరిస్థితికి గుర్తుగా ఇక్కడ ఉన్న తాటిచెట్టు పడిపోవడానికి సిద్ధంగా ఉంది. చెట్ల చుట్టూ మట్టిని తవ్వి తరలించడంతో ఈ దుస్థితి నెలకొంది.

-ఈనాడు, తిరుపతి

రామసేతు వంతెనపై అపరిశుభ్రత



పెరుగుతున్న రావి మొక్కలు



వంతెనపై నిలిచిన వర్షపునీరు



మట్టి పేరుకుపోయి మొలిచిన గడ్డి

తుమ్మలగుంట ఎస్వీ గోశాల వద్ద రైల్వే లెవెల్ క్రాస్‌పై ఉన్న రామసేతు వంతెనపై వాహనచోదకులు, పాదయాత్రగా వచ్చే శ్రీవారి భక్తులకు అపరిశుభ్రత స్వాగతిస్తోంది. వంతెనపై వర్షం నీరు వెళ్లే ఏర్పాటు లేకపోవడంతో భారీగా నిల్వ ఉంటోంది. పాచి పట్టి అపరిశుభ్రంగా తయారవుతోంది. రావి మొక్కలు ప్రమాదకరంగా వేళ్లూనుకుని పెద్దవవుతున్నాయి. వంతెనపై మట్టి పేరుకుపోతుండటంతో గడ్డి మొలిచింది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

-ఈనాడు, తిరుపతి

పారా మెడికల్ సేవలు ప్రశంసనీయం

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వైద్యులకు దీటుగా పారా మెడికల్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని విశ్రాంత న్యాయమూర్తి రాజీవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్వీ వైద్య కళాశాలలో మొదటిసారి పారా మెడికల్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వైద్య విద్యార్థులు ఫెస్ట్ నిర్వహించే తరహాలో పారా మెడికల్ ఫెస్ట్ శుక్రవారం జరిపారు. ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్లొమా ఇన్ అనస్థీషియాలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన సుబ్రహ్మణ్యంకు బంగారు పతకం బహూకరించారు.

క్రైం కార్నర్

ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ బలగాలు కడప జిల్లా పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్సై మురళీధర్‌రెడ్డి అతని బలగాలు బద్వేల్ సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద దాడులు చేయగా.. ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయడంతో ఒకరిని పట్టుకున్నారు. 14 దుంగలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి కేసులో బీటెక్ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: గంజాయి కేసులో బీటెక్ విద్యార్థిని అరెస్టు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు. శుక్రవారం ఉదయం పేరూరు శ్మశాన వాటిక వద్ద ముగ్గురు అనుమానితులు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లారు. పోలీసులను చూడగానే వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పేరూరుకు చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిగా గుర్తించారు. అతని వద్ద 230 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గుత్తేదారు దాడి చేశారని ఫిర్యాదు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ విడుదల చేసిన ఆన్లైన్ టెండర్లలో పాల్గొన్నందుకు చంద్రశేఖర్ అనే గుత్తేదారు తనపై దాడి చేసినట్లు చలపతిరెడ్డి అనే గుత్తేదారు కమిషనర్ మౌర్యకు ఫిర్యాదు చేశారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

జాతీయస్థాయి విద్యా సదస్సుకు సురేష్



కునాటి సురేష్

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కునాటి సురేష్‌కు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థలో ప్రసంగించే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ఆహ్వానం అందింది. న్యూదిల్లీలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థలో ఆంధ్రప్రదేశ్ తరపున ముఖ్యఅతిథిగా హాజరై విద్యా ప్రమాణాలు, మూల్యాంకన విధానంలో విద్యార్థుల స్థాయిని అనుసరించి సమతుల్యతను పాటించాల్సిన విధానం గురించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

ముక్కంటి సేవలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్



సుబ్రమణియన్‌కు వీడ్కోలు పలుకుతున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: న్యూదిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్ సుబ్రమణియన్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయం తరపున స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పశువైద్య సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

పశుపోషకుల అభ్యున్నతే లక్ష్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పశుపోషణ ఆధారంగా చేసుకున్న రైతుల అభివృద్ధిని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఊరందూరులోని స్వగృహంలో ఆయన శుక్రవారం అఖిల భారత పశుగణనకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించడంతో పాటు వైద్య సిబ్బందికి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పశుపోషకులకు ఎలాంటి కష్టాలు తలెత్తకుండా చూడటంతో పాటు లాభసాటి విషయమై అవగాహన కల్పించాలని కోరారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎస్.వి.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ప్రతి అయిదేళ్లకు ఒక పర్యాయం పశుగణన నిర్వహిస్తారన్నారు. 16 రకాల పెంపుడు జంతువులకు సంబంధించి జాతుల వారీగా సమాచారాన్ని ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కరపత్రాలు ఆవిష్కరించడంతో పాటు వైద్య సిబ్బందికి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఊహ, రవీంద్రవర్మ, అరుణ్‌కుమార్, ఉష, శరత్, పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

మనోన్మణికి ఊంజల్‌సేవ



కర్పూర హారతులు ఇస్తున్న ప్రధాన అర్చకులు కరుణ గురుకుల్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో మనోన్మణి అమ్మవారికి ప్రత్యేక ఊంజల్‌సేవ మహోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారపు అమ్మవారుగా పూజలందుకుంటోంది. అనంతరం ఆలయంలో ప్రాకారోత్సవాన్ని జరిపి అమ్మవారి ఆలయం వద్ద దర్పణం ముందు ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు కరుణా గురుకుల్ ధూప, దీప, నివేదనలు సమర్పించారు. ఈ విశేషోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కస్తూరినాయుడుకండ్రిగకు చెందిన శంకర్ అనారోగ్యంతో ఈ నెల 15వ తేదీన మరణించడంతో బంధువులు మృతదేహాన్ని అరణియార్ నదిలో ప్రమాదభరితంగా నడకతో శ్మశానానికి చేర్చాల్సి వచ్చింది. నదిలో నీటి మట్టం పెరిగితే పాడెను వదిలేయాల్సిన అవస్థల ప్రయాణంతో ఆఖరి మజిలీకి సహచరుడిని తీసుకెళ్లారు.



కస్తూరినాయుడుకండ్రిగలో అరణియార్ కాలువలో పాడెతో సహచరుల ప్రయాణం (పాతచిత్రం)

నారాయణవనం మండలం తిరువట్యానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో బంధువులు మృతదేహాన్ని పొలం గట్లపై మోసుకెళ్లాల్సి వచ్చింది. శ్మశానానికి వెళ్లేందుకు దారి లేక పోవడంతో పొలాల వెంబడే నడక సాగించాలి. పొలాల్లో పంట వేసిన సమయంలో పరిస్థితి దయనీయంగా మారుతోంది.



నారాయణవనం మండలం తిరువట్యంలో పొలం గట్లపై పాడె మోసుకెళ్తున్న బంధువులు (పాతచిత్రం)

పాడె ఎత్తాలంటే పాట్లు పడాల్సిందే

ఆఖరి మజిలిలోనూ అవస్థల ప్రయాణమే

నాగలాపురం, న్యూస్‌టుడే: శ్మశానాలు.. జీవించి ఉన్నప్పుడు ఎంతలా ఎదిగినా చివరకు ప్రతి ఒక్కరూ ఒదగాల్సిన ప్రాంతం. ప్రతి వ్యక్తికి ఆఖరి మజిలీకి కేంద్రంగా నిలిచే ఈ ప్రాంతాలు సత్యవేడు నియోజకవర్గంలో అధ్వానంగా మారాయి. కొన్ని గ్రామాల్లో శ్మశానాలకు స్థలాలు ఉన్నా అక్కడకు చేరడానికి దారి వసతి లేదు. మరికొన్ని గ్రామాల్లో అరణియార్ నది అడ్డుగా నిలుస్తోంది.

❖ నాగలాపురం మండలంలోని నాగలాపురం నుంచి సురుటుపల్లి వరకు ఉన్న గ్రామాల్లో అరణియార్‌లోనే అంత్యక్రియలు సాగిస్తున్నారు. వర్షాలు కురిస్తే కాలువలో నీళ్లు ప్రవహిస్తే పరిస్థితి దయనీయంగా ఉంటోంది. నారాయణవనం మండలంలోని తిరువట్యం, జంగాళపల్లిలో పొలాల గట్లే శ్మశానాలకు రహదారులుగా మారాయి. నారాయణవనం మినహా మిగిలిన గ్రామాల్లో రహదారి సమస్య తీవ్రంగా వేదిస్తోంది. కేవీబీపురం మండలంలోని జయలక్ష్మీపురం, దిగువపుత్తూరులో రహదారి ఆక్రమణలకు గురికావడంతో సమస్యలు తప్పడం లేదు. బీఎన్‌కండ్రిగలో అధ్వాన పారిశుద్ధ్యం వెక్కిరిస్తుండగా.. కాటూరు, కొత్తపాళెంలలో రహదారి ఆక్రమణలతో శ్మశానానికి చేరాలంటే వివాదాలు ఎదురవుతున్నాయి. వరదయ్యపాళెం మండలంలో కారిపాకంలో రహదారి లేక పోగా.. పులివల్లంలో పొలం గట్ల వెంబడి నడక సాగిస్తున్నారు. కోవూరుపాడు, కళత్తూరు, కడూరు ఎస్సీకాలనీల్లో ఆక్రమణల ధాటికి ఇబ్బందులు తప్పడం లేదు.

తహసీల్దార్లతో సమీక్షించి సమస్యను పరిష్కరిస్తాం

శ్మశానాలు, రహదారుల పట్ల ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఈ విషయంలో అన్ని మండలాల్లో తహసీల్దార్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తాను. శ్మశానాలకు వెళ్లే రహదారి ఆక్రమణలను తొలగించడంతో పాటు పారిశుధ్యం పట్ల చర్యలు తీసుకుంటాం. **- కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే.**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: నాగలాపురం వీకేఎంవీధిలో పలు తాగునీటి పైపులకు కుళాయిలు లేక పోవడంతో నీటి వృథా జరుగుతోంది. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- నరసింహులు, వీకేఎం వీధి**

సమాధానం: రెండు రోజుల్లో కుళాయిలను పునరుద్ధరించి నీటి వృథాను అరికడతాం. **- చిన్నదురైసుధ, సర్పంచి**

న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: మండలంలోని ఇలగనూరు పంచాయతీలో పలుచోట్ల పగటిపూట వీధి లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. లైట్లకు స్విచ్‌లు ఏర్పాటు చేయక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. **- పద్మిని, స్థానికురాలు**

సమాధానం: దీనిపై స్థానిక కార్యదర్శితో చర్చించి, వీధి లైట్లకు స్విచ్‌లను ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం. **- సురేంద్రనాథ్, ఎంపీడీవో**

న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ

సమస్య: బీఎన్‌కండ్రిగ పంచాయతీ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని వీధిలో విద్యుత్ స్తంభానికి అమర్చిన లైటు వెలగడంలేదు. పక్కన ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు అధికంగా చేరి పాములు సంచరిస్తున్నాయి. విద్యుత్తు దీపం వెలగడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే స్పందించాలి. **- శ్రీను, స్థానికుడు**

సమాధానం: స్తంభానికి ఉన్న వెలగని విద్యుత్ దీపం తొలగిస్తాం. మరొకటి ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: రేణిగుంట పంచాయతీలోని అన్నదానం సత్రం విధిలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో స్థానికంగా తీవ్ర ఇబ్బందిగా ఉంది. **- సురేష్, స్థానికుడు**

సమాధానం: వెంటనే ఇక్కడ వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- నాగేశం, సర్పంచి**

సమగ్రంగా భూ రికార్డులు రూపొందిస్తాం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: భూ సర్వేల్లో చోటు చేసుకున్న లోపాలను సవరించి భూ రికార్డులను సమగ్రంగా రూపొందిస్తామని తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని పిల్లమేడులో రీసర్వేపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 41 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య, మండల సర్వేయర్ హరినాథ్, వీఆర్వో కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సభ్యత్వ నమోదు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదును పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు శ్రేణుల సహకారం ఎంతో అవసరమని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి కోరారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో శ్రేణులతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నేతలందరూ తమవంతు బాధ్యతగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నేతలు సుబ్రహ్మణ్యం, ఈశ్వర్‌రెడ్డి, బత్తెయ్యయాదవ్, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పానగల్‌లోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని కోమలాదేవి, ఉపాధ్యాయులు

పోటీతత్వం.. ప్రతిభకు పట్టం

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరమని, తద్వారా ప్రతిభ వెలుగు చూస్తుందని శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కోమలాదేవి అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్‌నెట్ వాడకం వల్ల లాభాలు-నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భరత్, హారికారెడ్డి, వర్షలు తమదైన రీతిలో ప్రతిభను చాటుకున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని కోమలాదేవి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమలనాథ్, నళినీమోహన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

కేంద్ర మంత్రికి ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడికి రేణిగుంట విమానాశ్రయంలో ఘనవీడ్కోలు లభించాయి. తిరుమల శ్రీవారి దర్శనార్థం గురువారం రాత్రి ప్రత్యేక విమానంలో ఇక్కడికి చేరుకున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం తిరిగి విమానాశ్రయం చేరుకుని ఇక్కడి నుంచి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, విమానాశ్రయ అధికారులు తదితరులు వీడ్కోలు పలికారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పాడి పరిశ్రమ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నారాయణవనం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాడి పరిశ్రమ సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం నారాయణవనంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన పశు గణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడేలా ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసేలా భవిష్యత్ ప్రణాళిక, విధి విధానాల రూపకల్పనకు జాతీయ పశుగణన దోహద పడుతుందన్నారు. పాడి రైతులు పశు గణనకు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు కుమార్(పాలమంగలం), భార్గవి(నారాయణవనం), ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇలంగోవన్‌రెడ్డి, తెదేపా నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత పంటల తొలగింపు

శ్రీకాళహస్తి: చుక్కల నిడిగల్లు గ్రామంలో ముక్కంటి ఆలయానికి సంబంధించిన స్థలంలో ఆక్రమిత పంటలను ఆలయ అధికారులు తొలగించారు. ఆ గ్రామానికి చెందిన రైతులు అనధికారికంగా ఇక్కడున్న భూముల్లో కూరగాయల పంటల సాగు చేపట్టడంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై శుక్రవారం ఆలయ సిబ్బంది అక్కడ సాగుచేస్తున్న అక్రమ పంటలను తొలగించారు.

రాష్టస్థాయి యోగా పోటీలకు మీనాక్షి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని పెద్దకనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని మీనాక్షి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌పీబీఎస్ బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో విద్యార్థిని మీనాక్షి ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా మీనాక్షిని వ్యాయామ ఉపాధ్యాయులు చెంగల్రాయులు, పాఠశాల బృందం, గ్రామస్తులు అభినందించారు.



ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యంతో విద్యార్థిని మీనాక్షి

కబడ్డీ పోటీలకు పాలమంగళం విద్యార్థుల ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణవనం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాలమంగళం ఉన్నత పాఠశాల ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మనోహరి శుక్రవారం తెలిపారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి రాహుల్ తిరుపతిలో జరిగిన అండర్-19, తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు రాఖీ, కీర్తి పుత్తూరులో జరిగిన అండర్-14 ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందినట్లు పీడీ రాజా పేర్కొన్నారు.

మన్ కీ బాత్ క్విజ్ పోటీలు



విద్యార్థులతో ఉపాధ్యాయులు, భాజపా నాయకులు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే 'మన్ కీ బాత్'లో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో 40 మంది విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. అనంతరం భాజపా జిల్లా అధ్యక్షులు చంద్రప్ప మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆశయాలను, ఆలోచనలను భావితరం అందిపుచ్చుకుంటూ దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షురాలు తేజోవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో మృతి చెందిన భార్యాభర్తలకు కన్నీటి వీడ్కోలు

శోకసముద్రంలో ఆదరం గ్రామం

కేవీబీపురం, న్యూస్‌టుడే: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయితేజ, హరిత దంపతుల మృతదేహాలకు శుక్రవారం కన్నీటితో వీడ్కోలు పలికారు. ఈనెల 15వ తేదీన అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిత సంఘటనా స్థలంలోనే మృతి చెందగా సాయితేజ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం మృతదేహాలను వారి స్వగ్రామం కేవీబీపురం మండలం ఆదరం గ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహాలను చూసేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చారు. అతిచిన్న వయస్సులోనే దంపతులిద్దరూ రోడ్డు ప్రమాదంలో చనిపోవడాన్ని గ్రామస్థులు జీర్ణించుకోలేక పోయారు. తొట్టంబేడు, కేవీబీపురం, శ్రీకాళహస్తి మండలాల నుంచి ఉపాధ్యాయులు, మృతుల బంధువులే కాకుండా ఇదే మండలాల్లో అమెరికాలో స్థిరపడ్డ వారి బంధువులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

పశుపోషణతో ఆర్థిక ప్రగతి

ఏర్పేడు, న్యూస్‌టుడే: వ్యవసాయంతో పాటు పశుపోషణ చేపట్టడంతో రైతులు ఆర్థిక ప్రగతిని సాధించవచ్చునని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి తెలిపారు. మండలంలోని ఏర్పేడు, ఆమందూరు పంచాయతీలో పశుసంవర్ధక శాఖ అధికారులతో కలసి శుక్రవారం ఇంటింటికి వెళ్లి పశువుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. డా.శిల్ప, కృష్ణవేణి, కేకే రమణ, గుణయాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, రాధిక పాల్గొన్నారు.

బిల్లులు ఇచ్చేస్తాం.. పనులు ప్రారంభించండి

నాగలాపురం, న్యూస్‌టుడే: గోకులం పథకంలో ఎంపికైన లబ్ధిదారులు చేసే నిర్మాణాలకు త్వరితగతిన బిల్లులను అందిస్తామని ఎంపీడీవో బాలాజీనాయక్ పేర్కొన్నారు. మండల కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులతో ఆయన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత కొలతలతో నాణ్యమైన సామాగ్రితో గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సుధాకర్, ఈసీ సురేష్, ఎఫ్ఏ యోగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవాల్లో యూటీఎఫ్ నాయకులు

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మండల యూటీఎఫ్(ఐక్యఉపాధ్యాయవేదిక) స్వర్ణోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ చేసిన పోరాటాలు, విజయాలను జిల్లాకార్యవర్గ సభ్యులు మోహన్‌బాబు, రామకృష్ణారెడ్డి వివరించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులు శివకుమార్, విజయ్ ఆధ్వర్యంలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా శశికుమార్, ప్రధానకార్యదర్శిగా సురేష్‌భగవాన్, గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో వెంకటమోహన్, రుషేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న బస్సు

రేణిగుంట, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న వాహనాలను అధిగమించే క్రమంలో తమిళనాడు ఆర్టీసీ బస్సు కంటైనర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం చెన్నై నుంచి తిరుపతికి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు తూకివాకం పెట్రోల్ బంకువద్ద వాహనాన్ని అధిగమించే సమయంలో ముందు పోతున్న కంటైనర్‌ను ఢీ కొట్టి డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతిని చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సు చోదకుడిని 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. భారీగా స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

దాడికి పాల్పడిన నిందితుల అరెస్టు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన నిందితులను పట్టణ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారు. పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. ఈ నెల 19వ తేదీన పెళ్లకూరు మండలం అర్లపాడుకు చెందిన తరుణ్, తేజాలను విచక్షణా రహితంగా కొట్టడం, వాళ్ల నుంచి ఫోన్ లాక్కొని వెళ్లిన నేరానికి సంబంధించి పట్టణానికి చెందిన పెరుమాళ్, బాలాజీ, రాహుల్, కోమల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వాళ్ల వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ వీరు రాచగున్నేరి కోళ్ల పరిశ్రమ వద్ద కొంత మందిని కత్తులతో బెదిరించి దాడి చేశారని వివరించారు. వీరిని రిమాండ్‌కు తరలించామని, వీరిపై రౌడీషీట్లు తెరవనున్నట్లు తెలిపారు.



చిన్నపాటి వర్షానికి రహదారిపై నిలిచిన నీరు

చిరుజల్లుకే చెరువాయె

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మార్వో కార్యాలయ ముందు ఉన్న రహదారిపై చిన్నపాటి జల్లులు కురిసినా చెరువును తలపిస్తూ నీరు నిలుస్తోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వర్షపునీటిలో వెళ్లేందుకు వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి మధ్యలో నిర్మించిన కల్వర్టును ఎక్కువ ఎత్తులో నిర్మించడంతో ఈ రహదారి పల్లమై నీరు నిలుస్తోంది. నీరు నిల్వచేరే ప్రదేశంలో సీసీ రహదారి ఎత్తుగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాజేంద్ర కుటుంబానికి అండగా ఉంటాం



రాజేంద్ర భార్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజేంద్ర కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో మండలంలోని చియ్యవరం గ్రామానికి చెందిన తండ్రి, కుమారులు రాజేంద్ర, చైతన్యలు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. రాజేంద్ర భార్య గురవమ్మకు ధైర్యం చెప్పి రూ.50 వేలను ఆర్థిక సాయంగా అందించారు. మృతుని పిల్లలను పూర్తిగా చదివించే బాధ్యత తనదేనన్నారు. ప్రభుత్వం తరపున పరిహారంతో పాటు ఎకరం భూమి అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించాల్సింది పోయి వారిని క్షోభకు గురిచేసేలా శవ రాజకీయాలు చేయడం దారుణమని ఈ సందర్భంగా మండిపడ్డారు. ఆయన వెంట నేతలు చెంచయ్యనాయుడు, మునిరాజానాయుడు ఉన్నారు. **శ్రీకాళహస్తి:** అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న వాళ్లకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మెరుగైన వైద్యసేవలు పొందడం ఆనందకరమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవారం అనారోగ్య సమస్యలకు మెరుగైన వైద్యసేవలు పొందిన 11 మందికి రూ.11.60 లక్షల మేరకు నగదు చెక్కులను అందజేశారు.

చెరువును తలపిస్తున్న రోడ్లు



పట్టణంలోని కైలాసగిరిలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కువ మంది నివాస గృహస్థులు మురుగునీటిని రోడ్లపైకి వదలి పెడుతున్నారు. దీనికి తోడు వర్షాలు కురిసినప్పుడు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పురపాలక సంఘ పాఠశాలకు సమీపంలో రోడ్డుపై వర్షపు నీటి నిల్వలు చేరడంతో పిల్లలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**



మల్లెతోటలో కలుపు మందుల వాడకంపై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త మహేశ్వరరెడ్డి

అవసరం మేరకే కలుపు మందులు వినియోగించాలి

సత్యవేడు, న్యూస్‌టుడే: వివిధ రకాల పంటల్లో కలుపు మొక్కలను తొలగించేందుకు రైతులు కలుపు మందులు అవసరం మేరకే వినియోగించాలని, సంబంధిత వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని తిరుపతి వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో ఏడీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. వరి, వేరుశనగ పంటల్లో ఉపయోగించే ఎరువుల గురించి, మొక్కలకు మందులను పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డీఆర్‌సీ ఏడీఏ లక్ష్మీదేవి, మండల వ్యవసాయాధికారులు సంజీవరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, మురళీ, ద్వారకానాథ్, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 30 నుంచి రూ. 50 వరకు
రెండో రకం: కిలో రూ. 20 నుంచి రూ. 30 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	123
లేయర్	110
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	187

రీ సర్వేపై గ్రామసభ

చిల్లకూరు, న్యూస్‌టుడే: బల్లవోలు గ్రామంలో రీ సర్వే పూర్తి కావడంతో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్వేలో చోటుచేసుకున్న సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం

చిల్లకూరు: కడివేడులో విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందని వినియోగదారులు పేర్కొన్నారు. రోజుకి పలుమార్లు సరఫరా నిలిపేస్తున్నారని వాపోయారు. సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సమస్యను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

డక్కిలి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కుప్పాయపాళెంలో చిన్న వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. నీటి నిల్వతో దోమలు విజృంభిస్తున్నాయి. **- శ్రీను, కుప్పాయపాళెం**

సమాధానం: త్వరలో మురుగు కాలువల పనులు ప్రారంభిస్తాం. నీటి నిల్వ లేకుండా చూస్తాం. **- వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి**

నాయుడుపేట పట్టణం:

సమస్య: నాయుడుపేట పురపాలకలోని విన్నమాల వద్ద జాతీయ రహదారి డివైడర్లపై చెట్లు ఏపుగా పెరగడంతో రోడ్డు దాటే క్రమంలో వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. **- విజయభాస్కర్, స్థానికుడు**

సమాధానం: జాతీయ రహదారిపై నిబంధనల మేరకు మొక్కలు నాటుతారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని తొలగించే ప్రయత్నం చేస్తాం. **- విజయ్‌రాథోడ్, అధికారి**



గోడపత్రాలు అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సిబ్బంది

పశుపోషణతో మంచి లాభాలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పశువుల పెంపకంపై రైతులు దృష్టి సారిస్తే మంచి లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం పశుగణన గోడపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుకు పశువుల పెంపకం ఆర్థిక వనరుగా ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయంలో గ్రామీణులకు పశువుల పెంపకం ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ స్వామి, పశు వైద్యాధికారి కిషోర్ పాల్గొన్నారు. **వెంకటగిరి గ్రామీణం:** పశుగణనను పక్కాగా నిర్వహించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వెంకటగిరిలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోడపత్రాలు ఆవిష్కరించి సిబ్బందికి కిట్లను అందించారు.

అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

డక్కిలి, న్యూస్‌టుడే: మండలంలోని దేవుని వెల్లంపల్లి, డి.వడ్డిపల్లి, లింగసముద్రం పంచాయతీల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన 'పల్లె పండుగ'లో భాగంగా దేవుని వెల్లంపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డి.వడ్డిపల్లిలో సచివాలయ భవనం, లింగసముద్రంలో ఆర్.బి.కె కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏలేశ్వర రామచంద్రయ్య నాయుడు, మండల అధ్యక్షుడు పోలిరెడ్డి కోటేశ్వరరెడ్డి, నాయకులు ఏలేశ్వరం శ్రీహరినాయుడు, వేముల ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.



చెంగాళమ్మ ఆలయంలో అదనపు న్యాయమూర్తి

చెంగాళమ్మ సేవలో అదనపు న్యాయమూర్తి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయానికి శుక్రవారం నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ(పీఓఏ) యాక్ట్ కోర్టు అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.సరస్వతి వచ్చారు. ఆమె అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ఈవో ప్రసన్నలక్ష్మి ప్రసాదాలు అందజేశారు.

రాయితీ విత్తనానికి రెక్కలు

అర్హత ఉన్న రైతులకు ఎగనామం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఆరుగాలలపాటు శ్రమించి, పంటను సాగు చేసిన రైతులకు మాత్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. ఇటీవల సంభవించిన తుపాను నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు రాయితీపై వరి విత్తనాలు ఇవ్వాలని ప్రభుత్వం తలచింది. ఆ మేరకు విత్తనాలు గ్రామాలకు చేరాయి. అక్కడ నుంచి కొన్ని బస్తాలు వేరొక చోటకు తరలిపోయాయి.

జిల్లాలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ మధ్య వచ్చిన తుపాను నేపథ్యంలో పులికాట్ తీరంలోని దామరాయ, కొరిడి, కడపట్ర పంచాయతీల్లో రైతులు సాగుచేసిన వెద్ది పైర్లు నీటిలో మునిగి పాడయ్యాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి, మొత్తం 143 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక పంపారు. సంబంధిత రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.



మూతపడిన రైతు సేవా కేంద్రం

లెక్కలు తారుమారు..

గురువారం 70 క్వింటాళ్ల కేఎన్ఎం1638 రకం వరి విత్తనాలను పులికాట్ తీర గ్రామాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు నాయుడుపేట నుంచి లారీలో పంపారు. వీటిని కడపట్రలోని రైతు సేవా కేంద్రంలో నిల్వ చేసి, రైతులకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ వాహనం కడపట్రకు వెళ్లకుండా మార్గ మధ్యలోనే ఓ సంపద కేంద్రం వద్దకు తీసుకెళ్లి, అక్కడ విత్తనాల బస్తాలు దించారు. అందులో 40 బస్తాల విత్తనాలను మళ్లీ అదే లారీలో సూళ్లూరుపేటకు తీసుకెళ్లారు. దీనికి సంబంధించి ఎలాంటి లెక్కలు లేవు. వీటిని ఎవరికి ఇచ్చారో తెలియని పరిస్థితి.



సంపద కేంద్రంలో నిల్వ చేసిన రాయితీ విత్తనాలు

గతంలోనూ..

సూళ్లూరుపేట ప్రాంతంలో గతంలోనూ పచ్చిరొట్ట విత్తనాలు కూడా అర్హులైన రైతులకు ఇవ్వలేదు. ఒకరిద్దరికి కొన్నిచోట్ల ఇచ్చి, మిగిలిన విత్తనాలను ట్రాక్టర్ల ద్వారా వేరొకచోటకు తరలించిన దాఖలాలున్నాయి. దీనిపై అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. అలాగే గతంలో దొరవారిసత్రం మండలంలో రాయితీపై రైతులకు వేరుశెనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో లారీ విత్తనాలను మాత్రమే ఇక్కడ ఇచ్చారు. కొంత ఇక్కడ తీసుకుని, కొంత మంది రైతులకే ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వలేదు. అడిగితే ప్రశ్నిస్తే అయిపోయాయని అధికారులు సమాధానమిచ్చారు.

సరైన సమాధానం లేదు..

మిగిలిన విత్తనాలు ఏమయ్యాయో.. ఎవరు తీసుకెళ్లారో.. తెలియని విషయం. దీనిపై వ్యవసాయాధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వకుండా మాట దాటవేస్తున్నారు. కడపట్ర పంచాయతీలో చాలా మంది రైతులు పంటను నష్టపోయారు. అయితే అలాంటి వారికి గింజ అందలేదు. దాంతోపాటు కడపట్ర రైతు సేవా కేంద్రంలో విత్తనాలు నిల్వ చేసి, పంపిణీ చేయాల్సి ఉండగా... అధికారులు ఎందుకు మార్గ మధ్యలో ఓ సంపద కేంద్రంలో ఉంచారో తెలియని విషయం.

ఒకరిద్దరికి మాత్రమే..

కడపట్ర పంచాయతీ పరిధిలో పంట నష్టపోయిన రైతులకు అసలు విత్తనమే అందలేదు. ప్రభుత్వం మంజూరు చేసిన 70 క్వింటాళ్ల విత్తనంలో 40 బస్తాలు అక్కడ నుంచి సూళ్లూరుపేటకు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే చేతులమీదుగా విత్తనాలు పంపిణీ చేయాలని 40 బస్తాలు తీసుకొచ్చినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే గురువారం సాయంత్రం సూళ్లూరుపేటలోని రైతు సేవా సహకార సంఘ కార్యాలయంలో కేవలం ఒకరిద్దరు రైతులకు మాత్రం రెండు, మూడు బస్తాలు ఇచ్చి వెళ్లిపోయారు.

విచారణ చేపడతాం

పులికాట్ తీరంలో రైతు సేవా కేంద్రం ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలి. రైతులకు ఇచ్చినట్లు లెక్కలు ఉండాలి. ఎమ్మెల్యే కార్యక్రమం కోసం 40 బస్తాల విత్తనాలు సూళ్లూరుపేటకు తీసుకొచ్చాం. వాటిని కూడా పులికాట్ తీర ప్రాంత రైతులకు ఇవ్వాలి. దీనిపై విచారణ జరుపుతాం.
- అనిత, సహాయ సంచాలకురాలు, వ్యవసాయశాఖ

మురుగు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని పశువైద్యశాల సమీపంలో ఉన్న బస్సు షెల్టరు వద్ద మురుగు పేరుకుపోయింది. సమస్యపై 'ఈనాడు'లో 'అధ్వాన్నంగా బస్సుషెల్టర్లు' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ కిరణ్‌కుమార్ పారిశుద్ధ్య కార్మికుల చేత పరిసరాలు శుభ్రం చేయించారు.



ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ చంద్రకళను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ

వైద్యుల తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరుపై సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించి వార్డులు వైద్యులు ఉండే గదులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అరకొరగా ఉండడం గుర్తించారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంటు దూరంగా ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రిలో గదులు అపరిశుభ్రంగా ఉండడం గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యులు కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొరతగా చూపించి సరైన సేవలు అందించడం సరికాదన్నారు. లోపాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తెదేపా నాయకులు పాల్గొన్నారు. **దొరవారిసత్రం:** దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెంకి చెందిన తెదేపా నాయకుడు తూపిలి నారాయణరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శుక్రవారం తెదేపా నాయకులతో కలిసి నారాయణరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో శుక్రవారం నుంచి పశుగణన ప్రారంభించారు. దీనికి సంబంధించిన గోడపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. పశు వైద్యులు శ్రీదేవి, గౌతమ్, మనికుమారి, విజయ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచనా పోటీ.. ఆలోచనలకు మేటి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను శుక్రవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల కలిగే లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జి.సాయివెంకట్, ఎం.పూజిత్, బి.వెంకట్‌జశ్వంత్ గెలుపొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.బి.భారతి, ఉపాధ్యాయులు లావణ్య, పర్ణిత, విజయలక్ష్మీ పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

న్యాయవాదుల నిరసన

సూళ్లూరుపేట: పట్టణంలో ఐదో రోజు శుక్రవారం న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక కోర్టు ముందు నిరసన తెలిపి నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. న్యాయవాది ధర్మప్రసాద్‌పై అనుచితంగా ప్రవర్తించిన ఎస్సై బ్రహ్మనాయుడుతోపాటు అతనికి సహకరించిన వారిపై ప్రైవేటు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలోనూ పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

'సత్యనారాయణరెడ్డి నోరు అదుపులో పెట్టుకో'

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: నీచ రాజకీయాలను చేస్తూ అక్రమ సంపాదనకే అలవాటు పడిన వైకాపా నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నోరు అదుపులో పెట్టుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెదేపా సీనియర్ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్‌పై సత్యనారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, పట్టాభిరెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.



కోటలో ధ్వజమెత్తిన తెదేపా నాయకులు

'గంగాప్రసాద్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు'

కోట, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త, తెదేపా నాయకుడు గంగాప్రసాద్‌పై వైకాపా నాయకుడు సత్యనారాయణరెడ్డి అనుచితవ్యాఖ్యలు చేయడం దారుణమని తెదేపా మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్‌అహ్మద్, జిల్లా కార్యదర్శి తూపిలిరాధాకృష్ణారెడ్డి, జిల్లా రైతు విభాగ కార్యదర్శి మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కోటలో శుక్రవారం తెదేపా నాయకులు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. **వాకాడు:** తెదేపా సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్‌పై పెళ్లకూరు మండల వైకాపా నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు తగవని తెదేపా వాకాడు మండల అధ్యక్షుడు దువ్వూరు మధురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు.

సీఎస్‌డీటీగా మల్లికార్జునరావు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు, కోట, చిట్టమూరు మండలాల పౌరసరఫరాల శాఖ రెగ్యులర్ ఉప తహసీల్దార్‌గా మల్లికార్జునరావును నియమించారు. ఆయన కోట మండల రెవెన్యూ ఉప తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన వాకాడులో పౌరసరఫరాల గోదామును తనిఖీ చేశారు.

పరిహారం చెల్లించలేదని పనుల అడ్డగింత

చిల్లకూరు, న్యూస్‌టుడే: తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో నద్రావారిపాలెం వద్ద సాగరమాల రహదారి నిర్మాణం కోసం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వలేదంటూ భూ నిర్వాసితులు శుక్రవారం పనులను అడ్డుకున్నారు. మన్నేగుంటలోని సుమారు 11 మంది రైతులకు చెందిన భూముల్లో 5 ఎకరాలను రహదారి పేరిట గతంలో సేకరించారు. పరిహారం ఇవ్వకుండానే గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు పనులను అడ్డగించారు.



పనులు అడ్డుకుంటున్న భూ నిర్వాసితులు

బడి బియ్యం పంపిణీలో తాత్సారం

✷ ప్రతి నెలా ఇదే తీరుగా సరఫరా ✷ అవస్థల్లో నిర్వాహకులు

గూడూరు, వెంకటగిరి, న్యూస్‌టుడే: ఓజిలి మండలం మమ్మాపాళెం ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 24 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి నెలకు 50 కిలోల బియ్యం ప్రతి నెల రెండు, మూడు తారీఖుల్లో సరఫరా చేయాల్సి ఉంది. ఈ నెల బియ్యం ఇప్పటి వరకు అందకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ఇలా ప్రతి నెల ఇదే తీరు జరిగితే బియ్యం అందించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇదే తీరుగా పలు పల్లె ప్రాంతాల్లోని బడులకు బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

బడి బియ్యం సరఫరాలో పౌరసరఫరా శాఖ నిర్లక్ష్యం చేస్తోంది. బియ్యం ఇవ్వకున్నా లెక్కలేస్తున్న బడులకు చేరవేయలేదు. నెల మొదటి వారంలో అందజేయాల్సిన బియ్యం ఇప్పటిదాకా నెట్టు అందిస్తున్నారు. బియ్యం కొని భోజనం తయారీ చేయలేని నిర్వాహకులు అష్ట కష్టాలు పడుతున్నారు. నిత్యావసర ధరలు పెరిగి అల్లాడుతున్న నిర్వాహకులు బియ్యం పెద్ద సమస్యగా మారుతోంది.

నియోజకవర్గంలో 916 పాఠశాలలు..

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో 916 బడులున్నాయి. వీటికి ప్రతి నెలా సుమారుగా 118 మెట్రిక్ టన్నుల మేర సరఫరా చేయాల్సి ఉంటోంది. ఇందుకు స్టాక్ పాయింట్ల నుంచి ప్రతి నెల 20 నుంచే చౌకదుకాణాలకు చేరవేస్తున్నారు. ఇక్కడి దుకాణాదారుల నుంచి బియ్యం ఎండీయూలలో బడులకు చేరవేయాల్సి ఉంది. చాలా చోట్ల ఎండీయూలు లేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డీలర్లు బడి బియ్యం వారి వాహనాల్లో చేరవేస్తున్నారు.



భోజన తయారీలో నిర్వాహకులు

డివిజన్‌లో బియ్యం సరఫరా

డిపోలు	బడులు	బియ్యం(కి.లో)
గూడూరు	79	11,279
నాయుడుపేట	199	25,199
సూళ్లూరుపేట	180	26,365
వాకాడు	232	28,028
వెంకటగిరి	226	27,979

తీరప్రాంత బడుల్లోనూ ఇదే పరిస్థితి..

తీరప్రాంత మండలాల్లోని బడుల్లో ఇదే తీరు నడుస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. బియ్యం కోసం తరచూ అడగాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రతి నెల ఠంచనుగా ఇవాల్సిన బియ్యంపై అధికారుల నిఘా లేకపోవడంతో సమయానికి అందడంలేదు. కొందరు ప్రధానోపాధ్యాయులు సంబంధిత పౌరసరఫరాల అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై పెళ్లకూరు ఎంఈవో శంకరయ్యను వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



సాగునీరు పారేదెలా?

చిట్టమూరు సమీపంలోని రొయ్యలవాగుకు అడ్డంగా ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన లో లెవల్ వంతెన వినియోగంలో లేకుండా పాడుబడి సాగునీటి పారుదలకు అడ్డంకిగా తయారైంది. పలు గ్రామాల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. లోలెవల్ వంతెన వల్ల గతంలో చిన్నపాటి వర్షం వచ్చినా రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలోనే 35 సంవత్సరాల కిందట హైలెవల్ వంతెన నిర్మించారు. అనంతరం లోలెవల్ వంతెన పాడుబడింది. అయితే రొయ్యలవాగుకు కొద్దిపాటి సాగునీరు వస్తే పారుదల ఉండడం లేదు. అక్కడే నిలిచిపోతున్నాయి. పాడుబడిన వంతెనను తొలగించాలని అన్నదాతలు పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అధికారులు మాత్రం ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టమూరు(కోట)**

గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తిరుపతిలోని స్విమ్స్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం మంగానెల్లూరులో పింక్ బస్సు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి జి.హరిత మాట్లాడుతూ.. 40 ఏళ్లు పైబడిన మహిళలు మూడేళ్లకొకసారి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఐ.రమణయ్య, సర్పంచి శేఖర్ పాల్గొన్నారు.



మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు 'గిరి' విద్యార్థి

వెంకటగిరి: పట్టణంలోని బీసీ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి షేక్ అబ్దుల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పాండురంగరావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని గురుకులం సిబ్బంది శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయ బృందం

నల్లరిబ్బన్లతో తపాలా ఉద్యోగుల నిరసన

కోట, న్యూస్‌టుడే: పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ కోట, విద్యానగర్ తపాలా ఉద్యోగులు నల్లరిబ్బన్లు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఉద్యోగులపై అదనపు పని భారం మోపుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో తపాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోట, న్యూస్‌టుడే: కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి గణేశ్(18) అనే యువకుడు మృతి చెందాడని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. గణేశ్ విద్యానగర్ నుంచి ద్విచక్ర వాహనంపై చిట్టేడుకు వెళ్తుండగా.. చిట్టేడు ర.భ రోడ్డుపై ప్రమాదం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

సభ్యత్వ నమోదు.. నాయుడుపేట: తెదేపా నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నాయుడుపేట శ్రీనివాస కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభిస్తారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు.

రెవెన్యూ గ్రామసభలు .. సూళ్లూరుపేట: మండలంలోని కొమ్మినేనిపల్లిలో తహసీల్దార్ నరసింహరావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. **వాకాడు:** మండలంలోని నామకాడు బీట్-2 రెవెన్యూ పరిధిలోని భూములపై కొండూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. రీసర్వే సమయంలో కొలతల్లో తేడాలు వచ్చాయంటూ వాకాడు మండల తెదేపా అధ్యక్షుడు దువ్వూరు మధురెడ్డి, ఉప తహసీల్దార్ సందీప్‌కు అర్జీ ఇచ్చారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి.. చిట్టమూరు(కోట): చిట్టమూరు మండలం కొత్తగుంటలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ సర్పంచి కోటయ్య వాకాడు ఎక్సైజ్ సీఐకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. **వాకాడు:** చిట్టమూరు మండలం కొత్తగుంట కూడలిలో, కోట పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ చిట్టమూరు సర్పంచి, తెదేపా నేతలు, కోట భాజపా నేతలు శుక్రవారం వాకాడులోని ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

వ్యవసాయాధికారుల నియామకం.. సూళ్లూరుపేట: స్థానిక వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో కొత్తగా ఇద్దరు వ్యవసాయాధికారులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక ఏడీఏ కార్యాలయానికి నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట నుంచి వైదేహి, తడకు సైదాపురం నుంచి కిరణ్‌ను బదిలీ చేశారు.

గిరిజన కుటుంబానికి చేయూత.. గూడూరు పట్టణం: చిట్టమూరు మండలంలో రొయ్యల గుంటల వద్ద ఆత్మహత్య చేసుకున్న చెంచుకృష్ణయ్య కుటుంబానికి ఐటీడీఏ అధికారులు శుక్రవారం రూ.10వేలు, నిత్యావసర సరకులు అందజేశారు.

ఆరుగురు విద్యార్థులకు గాయాలు.. నాయుడుపేట పట్టణం: నాయుడుపేట అన్నమేడు సమీప స్వర్ణముఖి వంతెనపై ఆటోను లారీ ఢీకొన్న ఘటన శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుమంది విద్యార్థులు గాయపడ్డారు. మండలంలోని కూచవాడ, కూచవాడపాళెం, అయ్యపరెడ్డిపాళెం ప్రాంతాలకు చెందిన ఆరుమంది విద్యార్థులు ఆటోలో నాయుడుపేటలోని కళాశాలకు వస్తుండగా మార్గ మధ్యలో నెల్లూరు నుంచి వస్తున్న లారీ ఢీకొంది.